విజయవాడకు రైళ్ల కొరత

- 3 నెలల ముందే వెయిటింగ్ లిస్టులు వందల్లో...
- రద్దీ ప్రయాణికులతో అవస్థలు


గుంతకల్లు జంక్షన్‌లో రిజర్వేషన్ టికెట్ల కోసం క్యూలో ఉన్న ప్రయాణికులు

గుంతకల్లు: విజయవాడకు కొత్త రైళ్ల ఏర్పాటు చేయాలని అనంతపురం జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. అమరావతి రాజధానికి రోజురోజుకు ప్రజల రాకపోకలు పెరుగుతున్నాయి. విద్యార్థులు విజయవాడలో అధిక సంఖ్యలో ఉండటం, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విజయవాడకు వెళ్లి రావలసి వస్తుండటంతో రద్దీ పెరిగింది. ముఖ్యంగా కనకదుర్గ అమ్మవారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో విజయవాడకు వెళ్తుంటారు. సమీపిస్తున్న వేసవిలో విజయవాడ రైలు ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం విజయవాడకు 9 రైళ్లు నడుస్తున్నాయి. ఈ రైళ్లు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇక గుంతకల్లు నుంచి విజయవాడకు కేవలం ఒక్క బస్సు మాత్రమే ఉంది. దీంతో రాజధానికి వెళ్లే ప్రయాణీకులకు సమస్యగా మారింది.

రాజధానికి రైళ్ల కరువు..

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక జిల్లా నుంచి విజయవాడకు కేవలం 2 కొత్త రైళ్లు వచ్చాయి. గతంలో ఉన్న 7 రైళ్లకు తోడు ఈ రెండు కలిశాయి. రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం రైల్వేస్టేషన్ల మీదుగా ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. హుబ్లీ-విజయవాడ-హుబ్లీ (రైలు నం-56501/502), బెంగుళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(రైలు నం -18464), ధర్మవరం-విజయవాడ-ధర్మవరం, హుబ్లీ-విజయవాడ (17226) ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే రోజూ నడుస్తుంటాయి. ఇక కొండవీడు ఎక్స్‌ప్రెస్ వారానికి మూడు సార్లు, అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు (నం 18048) వారానికి నాలుగు సార్లు ప్రయాణిస్తుంటుంది. దీంతోపాటు ఎస్ఎస్‌సీఎన్ ఎక్స్‌ప్రెస్(22882) బై వీక్లీ రైలు నడుస్తోంది. ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు మీదుగా విజయవాడకు రోజూ నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)కు కనీసం 3 నెలలు ముందుగా టిక్కెట్లు తీసుకోవాలి. నెల ముందు రిజర్వేషన్ చేయించినా సీట్లు లభించడు. వచ్చే సంక్రాంతి సెలవులు, విజయవాడ దుర్గమ్మ భవాని మాలధారుల వేలాదిగా రాకపోకలు సాగిస్తుండంతో రైళ్లు దొరకక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక కరోనా సమయంలో రద్దు చేసిన బెంగళూరు-విజయవాడ-బెంగళూరు (నం-54503/504) ప్యాసింజర్ రైళ్లను పునఃప్రారంభించాలని ప్రయాణికులు కొరుతున్నారు.

అదనపు బోగీలు అవసరం

రాజధానికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కనీసం మూడు నెలల ముందే రిజర్వేషన్ ఓపెన్ అయిన కొన్ని గంటల్లోనే బెర్తులన్నీ బుక్ అవుతున్నాయి. రిజర్వేషన్ దొరకని వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులు సర్దుకుపోవాల్సిన దుస్థితి. గుంతకల్లు, అనంతపురం, గుత్తి, ధర్మవరం పట్టణాల మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు 23 బోగీలతో వెళుతుంది. మిగిలిన రైళ్లన్నీ 21 బోగీలతో నడుస్తున్నాయి. విజయవాడ-హుబ్లీ ప్యాసింజర్ రైలులో కేవలం స్లీపర్-2, జనరల్-7, మరో 2 బ్రేక్ వ్యాన్లు మొత్తం 11 బోగీలతో నడుపుతున్నారు. అలాగే బెంగళూరు-విజయవాడ ప్యాసింజర్ రైలు 2 స్లీపర్ బోగీలతో కలిపి 13 బోగీలతో నడుపుతున్నారు. సాధారణ బోగీలో 80 నుంచి 90 మంది ప్రయాణికులు వెళ్లేందుకు మాత్రమే వీలుగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఒక్కో జనరల్ బోగీలో 150పైగా ప్రయాణిస్తుండడంతో ఈ బోగీలో ప్రయాణికులతో కిటకిటలాడుతుంటాయి. శుక్ర, శనివారల్లో బయల్దేరే వారు, సెలవు రోజుల్లో వెళ్లే వారి వల్ల ఈ సంఖ్య కాస్తా 200కు చేరుకుంటోంది. దీంతో బోగీలో నిలబడేందుకు కూడా చోటుండడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. విజయవాడకు అదనంగా రైళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసుత్తం నడుస్తున్న రైళ్లకు స్లీపర్, జనరల్ బోగీలను పెంచితే సమస్య పరిష్కారం అవుతుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలి



రోజు రోజుకు విజయవాడకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. భవానీ మాలాధారుల ఇరుముడి జనవరి మొదటి వారంలో ఉండడంతో 3 నెలలు ముందుగా రిజర్వేషన్ తీసుకున్నా సీట్లు దొరకలేదు. దీనికి తోడు సంక్రాంతి సెలవులు అదేనెలలో రావడంతో గుంతకల్లు మీదుగా వెళ్లే విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కిటకిటలాడుతున్నాయి. అ సమయంలో తత్కాల్ టిక్కెటు కోసం ప్రయత్నంచినా దొరికే అవకాశం లేదు. విజయవాడకు రద్దీకి తగట్టుగా కనీసం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఏర్పాటు చేయడంతోపాటు అదనపు స్లీపర్ బోగీలు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– హనుమష్, భవాని మాలధారుడు, గుంతకల్లు

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం


కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక రోటరీ హైస్కూల్‌లో రోటరీ, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి, ఆర్థో వైద్యశిబిరాలను నిర్వహించారు. కర్నూల్ సన్‌షైన్ ఆస్పత్రికి చెందిన కంటి వైద్యనిపుణులు సుమారు 105 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించగా కంటి చూపు మందగించిన 30 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. అలాగే ఆర్థోపెడిక్ వైద్యులు ఎముకల సాంద్రత నిర్ధారణకై బీఎండీ టెస్టింగ్ మిషన్ ద్వారా సుమారు 195 మందికి పరీక్షలు నిర్వహించారు. క్యాంప్ సేవాదాతలైన వంకదారు రామకృష్ణయ్య కుటుంబసభ్యులను రోటరీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, ఇన్నర్‌వీల్ అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, వరలక్ష్మి, సభ్యులు వీఎల్.గుప్త, ప్రదీప్, అనురాధ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లి, చాలవేముల గ్రామల్లో సోమవారం ‘వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మడుగుపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు చాలవేముల గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

పల్లె వెలుగు ప్రయాణికులకు బహుమతులు


బహుమతులను అందిస్తున్న డీఎం నారాయణస్వామి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు–ఆదోని రూట్ నందు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించి లక్కీడ్రాలో గెలుపొందిన మొదటి ముగ్గురు విజేతలకు డిపో మేనేజర్ నారాయణస్వామి ఆకర్షణీయ బహుమతులను అందజేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం మాట్లాడుతూ గడిచిన 15 రోజుల్లో గుంతకల్లు–ఆదోని రూట్‌లో ప్రయాణించిన వారి టికెట్లను లక్కీ డిప్ డ్రా తీశామన్నారు. రవి, నాగరాజు, విద్యశ్రీ అనే ప్రయాణికులు బహుమతులు గెలుపొందినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రజారవాణా వ్యవస్థ శాఖ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆయన కోరారు.

గడ్డివామి దగ్ధం


కాలిపోతున్న వరి గడ్డి

గార్లదిన్నె: కొప్పలకొండలో ఆదివారం గడ్డివామి అగ్ని మంటల్లో కాలి బూడిదైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామా నికి చెందిన వన్నూరప్ప పశువుల మేత కోసం 3 వేల వరిగడ్డి కట్టలు కొనుగోలు చేసి వ్యవసాయ దొడ్డిలో వాము వేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి 3వేల వరి గడ్డి కట్టలు మంటల్లో కాలిపోయాయి. చుట్టు పక్కల రైతులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

అనాథలకు ఆర్థిక సాయం


చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవల సంస్థ ఆర్థిక సాయం చేసింది. ఆదివారం టైలర్స్ కాలనీలోని వివేకానంద పాఠశాలలో యల్లనూరు మండలం కూచివారిపల్లికి చెందిన అమృత, అజయ్ అనే పిల్లలకు రూ.10,116 నగదును అందజేసింది. కూచివారిపల్లికి చెందిన కుళ్లాయప్ప, నాగలక్ష్మి మృతి చెందారు. దీంతో వీరి పిల్లలు అమృత, అజయ్‌లు అనాథలుగా మిగిలిపోయారు. విషయం తెలుసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు చిన్నారులకు అండగా నిలిచారు. సంస్థ అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్ చెన్నకేశవ శ్రీరంగయ్య, ఉపాధ్యక్షులు వీరబాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుస్తకం.. ఓ మంచి నేస్తం


తాడిపత్రి కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాడిపత్రి అర్బన్: పుస్తకం ఓ మంచి నేస్తమని,పుస్తకం మూడక్షరాలే అయినా ఎంతో మంది కలలకు ఆధారమని భారత భాగవత ప్రవచనకర్త రాచకొండ జానకిరామశర్మ అన్నారు. తాడిపత్రికి చెందిన ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ ఆర్.ఉమాశర్మ రాసిన తాడిపత్రి కథలు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా హాజరైన రాచకొండ జానకిరామశర్మ మాట్లాడుతూ సామాన్యుని ఆయుధం పుస్తకమన్నారు. చిరిగిన చొక్కనైనా తొడుక్కో కాని మంచి పుస్తకం కొనుక్కోమన్న గురజాడ అప్పారావు సూక్తులను ఈసందర్భంగా గుర్తు చేశారు. ఒక పుస్తకం వెయ్యి మంది స్నేహితులతో సమానమని తెలిపారు. అందమైన అక్షరాలు, పదాల పలకరింపుతో పాఠకుడిని తనలో లీనం చేసుకునేదే పుస్తకమని వివరించారు. అనంతరం ఆర్.ఉమాశర్మ రచించిన తాడిపత్రి కథలు పుస్తకాన్ని ఆవిష్కరించి సభికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, అనువాదకులు జూటూరు షరీఫ్, రచయిత్రి ప్రొఫెసర్ ఆర్.ఉమా శర్మ, పలువురు వక్తలు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధిలో భాగస్వాములు కండి


మాట్లాడుతున్న గుత్తిటౌన్ బ్యాంకు సీఈఓ మహేశ్వరప్రసాద్

పామిడి: గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని బ్యాంకు సీఈఓ ఎస్ మహేశ్వరప్రసాద్ కోరారు. సోమవారం పామిడిలో బ్యాంకు కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈఓతో పాటు బ్యాంకు ప్రెసిడెంట్ ఎస్ అబ్దుల్ జిలాని మాట్లాడారు. వందేళ్ల క్రితం రూ.8 కోట్లతో ఆర్‌బీఐ నిబంధనలతో గుత్తిటౌన్ బ్యాంకును ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత బ్యాంకు టర్నోవర్ రూ.195 కోట్లుగా ఉందన్నారు. అందులో రూ.105 కోట్లు డిపాజిట్లు, రూ.90 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్న బ్యాంకు తమదన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ బ్యాంకులో డిపాజిట్లు చేసి బ్యాంకు అభ్యున్నతికి పాటుపడాలని వారు కోరారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచండి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ గంగయ్య

పెద్దపప్పూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి చిన్నపాటి సమస్య కూడా చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. దిశ యాప్ గురించి గ్రామాల్లో అవగాహన కలిపించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యాడికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

జీవితాన్ని ఉల్లాసంగా గడపాలి


మాట్లాడుతున్న మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: వృద్ధాప్యంలో సమస్యలను పట్టించుకోకుండా ఏదో ఒక వ్యాపకంతో జీవితాన్ని ఉల్లాసంగా ఆస్వాదించాలని మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పలుచోట్ల అఖిల భారత పెన్షనర్ల దినోత్సవ వేడుకలు జరిగాయి. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి తరిమెల అమరనాథరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, పారిశ్రామిక వేత్త ముదార్ సుధీర్, సుజాతమ్మ, సీఏ ప్రవీణ్, కవి రియాజుద్దీన్ అహ్మద్, సామాజిక సేవా కార్యకర్త సలీం మాలిక్ తదితరులు హాజరయ్యారు. లలిత కళాపరిషత్తులో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్, శీలా జయరామప్ప పెన్షనర్ల సమస్యలను వినిపించారు.

అనంతపురం సిటీ: అనంతపురంలో ప్రపంచ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రిటైర్డ్ జీఎం వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. ప్రస్తుత జీఎం ముజీబ్ పాషా, డీజీఎం బాలగంగాధర్ రెడ్డి, డాక్టర్ అక్బర్ సాహెబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం


సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం ఆదివారం అంబేడ్కర్ సర్కిల్‌లోని గుంతకల్లు అర్బన్ అండ్ రూరల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానప్ప కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు అశ్వర్థనారాయణ, లింగప్ప, సరోజినిని పూలమాల, శాలువాలతో సత్కరించారు. పదవీ కాలంలో వారు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నారాయణస్వామి, అధ్యక్షుడు మస్తానప్ప, కోశాధికారి మహబూబ్‌పీరా, పంపయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లు పెన్షనర్లు దేశానికి ఆస్తిలాంటి వారన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, కుళ్లాయి బాబు, సభ్యులు పాల్గొన్నారు.

బీకేఎస్ జట్టుపై తాడిపత్రి విజయం


ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ శ్వేతశ్రీ

తాడిపత్రి అర్బన్: ఆర్డీటీ సంస్థ నిర్వహిస్తున్న అనంతపురం ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన పోటీల్లో బుక్కరాయసముద్రం జట్టుపై తాడిపత్రి జట్టు విజయం సాధించింది. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో తాడిపత్రి, బీకెఎస్ జట్లు తలపడ్డాయి. తాడిపత్రి జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తాడిపత్రి జట్టు బౌలర్లు సమష్టిగా రాణించి 67 పరుగులకే బీకేఎస్ జట్టును ఆలౌట్ చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన తాడిపత్రి జట్టు వికెట్ నష్ట పోకుండా 4.1 ఓటర్లలోనే లక్ష్యాన్ని చేధించి విజేతగా నిలిచింది. తాడిపత్రి జట్టులోని శ్వేతశ్రీ 37 పరుగులు సాధించి జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించింది. ఈమెను ఉమెన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపిక చేశారు. తాడిపత్రి జట్టును ఆర్డీటీకోచ్ భార్గవ్, పీఈటీ అబ్రహం అభినందించారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు


కనకదాస జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల కేంద్రంలో ఆదివారం కురుబ సంఘం ఆధ్వర్యంలో కురుబల ఆరాధ్యుడు భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కురుబ సంఘం నాయకులు డ్యాం రోడ్డు సమీపంలో భక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కనకదాసు సైనిక కుటుంబంలో జన్మించి ఒక గొప్ప సైనికుడిగా విధులు నిర్వహించారన్నారు. తర్వాత మహాకవిగా మారాడన్నారు. నాయకులు పాండు, లింగయ్య, ఈశ్వరయ్య,రామలింగ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, వీరనారప్ప, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనారాయణ కల్యాణం


స్వామి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పామిడి: స్థానిక తగ్గు దేవాలయంలో ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిప్రకాష్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టంగుటూరు రాజశేఖర్, రాహుల్ గుప్తా ఉభయదారులు స్వామి వారి కల్యాణం జరిపించారు. ఏటా మార్గశిర మాసం తొలి ఆదివారం స్వాములవారి కల్యాణోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

నేడు ‘స్పందన’

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సమస్యలు అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని తహసీల్దారు సుమతి కోరారు. పజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర యాగం

అనంతపురం కల్చరల్: యాగాలలో కెల్లా విశిష్టమని చెప్పబడుతున్న బృహతీ సహస్ర యాగం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక పాతూరు ఉత్తరాధి మఠంలో కర్ణాటక మఠాల నుంచి వచ్చిన రుత్వికులు అనంతాచార్ అకుమంచి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు, యాగం నిర్వహించారు. ముఖ్యంగా పిండితో నిలువెత్తు గరుడ వాహనాన్ని యాగశాలలో ఏర్పాటు చేసి సాగిన పూజలు భక్తిభావాన్ని పెంచాయి. 1,008 కలశాలతో ఆహూతులు నిర్వహించి యాగ రక్షను అందించారు. మధ్యాహ్నం నారాయణ సేవ, తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మఠం నిర్వాహకులు హరి ఆచార్, వినోదాచార్, కృష్ణారావు, సీనియర్ న్యాయవాది ఆదోని గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ల ఏర్పాటు, ఇతర మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈమేరకు ట్రాన్స్‌కో ఏడీఈ రంగస్వామి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండవ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్, మండీబజార్, హనుమేష్‌నగర్, మోదినాబాద్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


వాసవీ మాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలను ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, అభిషేకాలు, సహస్ర నామార్చాన, లలిత పారాయణం వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యాడికి తహసీల్దార్‌గా రాజ్‌కుమార్



యాడికి: యాడిక తహసీల్దార్‌గా రాజ్‌కుమార్‌ను జిల్లా ఉన్నతాధికారులు ఆదివారం నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న బాలమ్మ అనారోగ్యంతో సెలవులో వెళ్లారు. దీంతో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న రాజకుమార్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాసం శుక్ల పక్షం షష్టి దనిష్ట శతభిష నక్షత్రంలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మట్కాబీటర్ల అరెస్ట్

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన బాబు, సురేష్, కొడవండ్లపల్లికి చెందిన మహేష్ మట్కా రాస్తుండగా పట్టుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. నిందితుల నుంచి మట్కాపట్టీలతో పాటు రూ.7వేలకుపైగా నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

జకినీ మాత ఆలయాన్ని సందర్శించిన సాధువులు

గుత్తి: పట్టణంలోని ఆరె కటికల ఆరాధ్యదైవం సునామ జకినీ మాత ఆలయాన్ని ఆదివారం హరిద్వార్‌కు చెందిన సాధువులు సందర్శించారు. సుమారు 25 మంది సాధువులు సునామ జకినీ మాతకు ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు పాలకావడి ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పలు పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం షష్ఠి సందర్భంగా ఉదయం 8 గంటలకు పాలకావడి ఉత్సవం, 9 గంటలకు సర్ప సూక్త పాలాభిషేకం, పంచామృతాభిషేకం, 10 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం, 11 గంటలకు బంగారు కవచ సేవ, 11:30 గంటలకు మంత్ర పుష్పము, 3 గంటలకు గ్రామోత్సవం, 4:30 గంటల నుంచి నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంతల ఆదాయం రూ.4.25 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జీవాల సంతల ద్వారా రూ.4.25 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,21,990, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.2,04,000 వసూలైనట్లు పేర్కొన్నారు.